క్లుప్తంగా

సంస్కృతం పాండిత్యాన్ని పెంచుతుంది



గుడివాడటౌన్: సంస్కృత భాష పాండిత్యాన్ని పెంపొందింప చేస్తోందని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట సత్రంలో సంస్కృత భారతి గుడివాడ శాఖ బాలకేంద్రం వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సంస్కృతంలో పాండిత్యం సాధించినవారు సంస్కృతీ సంప్రదాయాలను అలవర్చుకుంటారన్నారు. వేదాల పఠనం వారికి సులవవుతుందని ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందించుకోగలుగుతారని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపద్రష్ట రామస్వామి శాస్త్రి, నిర్వాహకురాలు పిన్నమనేని భవాని, చోడవరపు విజయకుమార్, ఉపద్రష్ట రమణమూర్తి, దినవాహి కుమార్ పాల్గొన్నారు.

23 మంది జూదరుల అరెస్ట్

గుడ్లవల్లేరు: వేమవరంలో పేకాట శిబిరంపై గుడ్లవల్లేరు పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో 23 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్.ఐ వి.యేసేబు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2.86 లక్షలు పట్టుబడినట్లు పేర్కొన్నారు. నిందితులను గుడివాడ కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

విశ్వవిఖ్యాత ఎన్టీఆర్ గ్రంథావిష్కరణ



గ్రంథావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

గుడివాడటౌన్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే కాక తమిళనాట సైతం విశ్వ విఖ్యాత నటసార్వభౌమునిగా ఖ్యాతి గాంచిన నటుడు, నాయకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) అని ఏఎన్నార్ కళాశాల పూర్వ తెలుగు అధ్యాపకుడు కోగంటి గాంధీబాబు అన్నారు. ప్రముఖ రచయిత వసుధ రచించిన విశ్వవిఖ్యాత ఎన్టీఆర్ గ్రంథావిష్కరణ ఆదివారం స్థానిక సీటీయూ కార్యాలయంలో జరిగింది. మహానటుడుగా ప్రజా నాయకునిగా ఖ్యాతి గడించిన ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా వసుధ కవిత్వ రచనకు పూనుకొనడం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్ నటన, పాలన, భాషా సేవలు, సంస్కరణలు, సంక్షేమాలను పిల్లల భాషలో 128 కవితలుగా రాయడం వసుధ గొప్పదనమన్నారు. కార్యక్రమంలో డైట్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎంవీజే ఆంజనేయులు, కవయిత్రి సాయిలక్ష్మి, జి.మాల్యాద్రి, వసుధ బసవేశ్వరరావు, కేటీఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ధనేశ్వరి, సాహితీవేత్తలు లంకా సురేంద్ర, బీవీ శ్రీనివాస్, వంగిపురపు వీర రాఘవాచారి, కృష్ణకిషోర్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరలంకలో అన్నసమారాధన



కైకలూరు(కలిదిండి): స్థానిక భోగేశ్వరలంకలో కొలువై ఉన్న పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర స్వామి దేవాలయంలో 16 రోజుల పండగ సందర్భంగా ఆదివారం 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిగింది. ఉదయం ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు దంపతులు స్వామివారికి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం పంచగవ్యం, మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు రఘువీరశర్మ యాజ్ఞకుల నిర్వహణలో నిర్వహించారు. ప్రతీ ఏటా శివరాత్రి మహోత్సవాలు ముగిసిన తర్వాత ఈ వేడుక చేయడం ఆనవాయితీగా వస్తోంది. చిట్టూరి నాగేశ్వరరావు, రాజనాల సాంబశివరావు, పెరవల శ్రీనివాసరావు, బడ్డీ కొట్టు శివ, పెటేటి వివేక్‌లు దాతలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ అడివి వెంకట గంగాధర శర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి ఆటల పోటీలు

పామర్రు: పామర్రు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు పలురకాల ఆటల పోటీలను నిర్వహించామని ఐసీడీఎస్ సీడీపీఓ వి.భానుశ్రీ తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆటల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. రన్నింగ్, స్పీడ్ వాక్, కబడ్డీ, ఖో-ఖో ఆటల్లో పోటీలు నిర్వహించారు. ప్రాజెక్టు స్థాయిలో విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయిలో గెలిచిన వారికి ఈ నెల 8వ తేదీన జరిగే మహిళా దినోత్సవం రోజున బహుమతులను అందజేస్తామని చెప్పారు. పామర్రు హైస్కూల్ పీడీ సహకారంతో ఆటల పోటీలను నిర్వహించామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.విజయకుమారి, వై.పుణ్యావతి, ఎం.శివనాగమణి, అనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

- నాడు – నేడు పథకంతో మారనున్న రూపురేఖలు
- నియోజకవర్గంలో 11 నూతన భవనాల నిర్మాణం
- 311 సెంటర్లలో 6,298 మంది చిన్నారులు



కైకలూరు మండలం ఆటపాకలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

కైకలూరు: నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారుతున్నాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లను మార్పు చేయడానికి పూర్తి ప్రణాళికతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు ముందుకు వేస్తున్నారు. ఇప్పటికే ఇంగ్లిష్ మీడియం అనుసంధానంగా చదువులు చెబుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలు చిన్నారులు, గర్భిణులు, తల్లులకు మేలు చేకూర్చుతున్నాయి. నాడు – నేడు పథకంలో రెండు విడతలుగా భవనాలను ప్రభుత్వం నిర్మిస్తోంది.

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో 311 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 6,298 మంది చిన్నారులు చదువుతున్నారు. సెంటర్ల విషయానికి వస్తే మొత్తం 140 సొంత భవనాలు, 97 అద్దె భవనాలు, 74 ప్రభుత్వ ఉచిత భవనాల్లో సెంటర్లు నడుస్తున్నాయి. అంగన్‌వాడీలకు వస్తున్న చిన్నారుల విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. చిన్నారులతో సృజనాత్మకశక్తిని పెంపొందించడానికి ఆట వస్తువులు సెంటర్లలో అందుబాటులో ఉంచారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు చిన్నారులు, గర్భిణులు, తల్లులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలు ఇలా..

మండలం	మొత్తం కేంద్రాలు	సొంతవి	అద్దెవి	ఉచిత సెంటర్లు	పిల్లలు
కైకలూరు	76	21	35	20	2,037
కలిదిండి	74	35	18	21	2,139
మండవల్లి	71	26	24	21	933
ముదినేపల్లి	90	58	20	12	1,189
మొత్తం:	311	140	97	74	6,298

శరవేగంగా పనులు

నాడు – నేడు పథకంలో ఒక్కో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.24 లక్షలను కేటాయిస్తోంది. కైకలూరు మండలంలో ఆటపాకలో 2, వరహాపట్నంలో 2, రామవరం, పల్లెవాడ, గోకర్ణపురం, పెదకొట్టాడ, దొడ్డిపట్ల, కైకలూరు, ముదినేపల్లి మండలంలో చిగురుకోటలో 2, వడాలిలో రెండో విడతలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం జరుగుతుంది. ఇప్పటికే పిల్లర్ల దశకు పనులు చేరుకున్నాయి. అధికారులు వీటి నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

వేగంగా నిర్మాణాలు..



అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. నాడు – నేడు భవనాలు రెండో విడతలలో 11 కేంద్రాలు మంజూరయ్యాయి. త్వరగా నిర్మాణాలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలకు తల్లిదండ్రులు పిల్లలను పంపించాలి.

– బందెల ఆనంద్, సీడీపీఓ, కైకలూరు ప్రాజెక్టు

వైభవంగా ముగిసిన గంగానమ్మ జాతర



గంగానమ్మ అమ్మవారు



విశేష పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కైలే

పామర్రు: ఆరు రోజులుగా నిర్వహిస్తున్న గంగానమ్మ జాతర ఆదివారంతో వైభవంగా ముగిసింది. ఈ నేపథ్యంలో భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు జాతరలో పాల్గొన్నారు. గ్రామస్తులు తమ పశువులను, వాహనాలను, ఎడ్ల బండ్లను, మొక్కుబడులను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు గండ దీపాలను తల మీద పెట్టుకుని మేళ తాళాలతో ఊరేగింపుగా తమ ఇళ్ల వద్ద నుంచి ఆలయానికి చేరుకుని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారికి చద్ది నివేదనలను తమ వెంట తెచ్చి ఆలయంలో సమర్పించారు. భక్తులు విరాళాలు అందజేశారు. తొలుత ఆలయం నుంచి అమ్మవారిని మేళ తాళాలతో డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ పొలిమేరల వద్దకు చేరుకుని తొలి రోజున పొలిమేరల్లో కట్టిన రక్షలను తొలగించేశారు. అనంతరం అమ్మవారిని ఆలయానికి తీసుకువచ్చారు. భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. వచ్చిన భక్తులను ఏవిధమైన అసౌకర్యాలు కలుగకుండా కమిటీ సభ్యులు తగు విధమైన చర్యలు తీసుకున్నారు. భక్తులు రాత్రి 10 గంటల వరకు ఆలయంలో విశేషంగా పూజలు నిర్వహించారు.

ఉచిత ప్రసాద వితరణ

ఆలయానికి వచ్చిన భక్తులకు స్థానిక అక్షయ ఫౌండేషన్ ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. మనం-వనం ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక నాలుగ రోడ్ల కూడలి వద్ద పీఎస్ఆర్ ఆర్థిక సహాయంతో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.నాగ మల్లేశ్వరరావు, పసుపులేటి రవి, పసుపులేటి శ్రీను, నత్తా రవి, సుబ్బు, కిరణ్ పాల్గొన్నారు. భక్తులు బొండా నాగేశ్వరరావు, కొనసాని శివ శంకరరావుల వితరణతో భక్తులకు 10వేల వాటర్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకట రామిరెడ్డి, సభ్యులు నందిపాటి బాలసుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, డి.బాల వెంకటేశ్వరరెడ్డి, బి.రాజేష్‌రెడ్డి, గుజవర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.అంజిరెడ్డి, భీమవరపు శ్రీనివాసరెడ్డి, సరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, మున్నంగి వెంకటరెడ్డి, దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనించాలి

పామర్రు: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనించాలని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక గంగానమ్మ తల్లి జాతర సందర్భంగా ఆదివారం సాయంత్రం అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఏ రమాదేవి, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, పి.రత్నకుమారి ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు దొంతిరెడ్డి శ్రీరామిరెడ్డి, కె.రాణి, నందిపాటి సాంబిరెడ్డి, కె.పెద వెంకటరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొల్లేరు సమస్యల పరిష్కారానికి సీఎం కృషి



గోకర్ణపురంలో ఆర్డీఓ కిషోర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ

కైకలూరు: కొల్లేరు ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ చెప్పారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో భాగంగా గోకర్ణేశ్వర స్వామి దేవస్థానం వద్ద జరిగిన అన్నసమారాధనలో ఆయన ఆదివారం పాల్గొన్నారు. అదే సమయంలో ఏలూరు ఆర్డీఓ పెంచల కిషోర్ స్వామివారి దర్శనానికి వచ్చారు. ఆర్డీఓతో జయమంగళ మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్యం ప్లస్ 5 కాంటూరు వరకు 77,138 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. అభయారణ్యాన్ని ప్లస్ 3 వరకు కుదించడం వల్ల పట్టా, డి-ఫాం భూములు మినహాయించితే 23,335 ఎకరాలు మిగులుతుందన్నారు. కొల్లేరు ఆపరేషన్ సమయంలో అప్పటి కృష్ణాజిల్లా పరిధిలోని కైకలూరు, మండవల్లి మండలాల్లో అదనంగా 7,500 ఎకరాలను ధ్వంసం చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం భూముల రీసర్వే చేయిస్తున్నారన్నారు. ఇది పూర్తయిన తర్వాత పేద ప్రజలకు భూములు పంపిణీ చేసే అవకాశం ఉటుందన్నారు. జిల్లా కలెక్టర్ నిర్వహణలో కొల్లేరు పేద ప్రజల భూముల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డీలు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సైదు గాయత్రీ సంతోష్, సయ్యపరాజు గుర్రాజు, సర్పంచ్ ఘంటసాల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు ఘంటసాల నాగమణి, దేవస్థాన చైర్మన్ చింతల సాయిబాబు, ఘంటసాల జగన్నాథం, మాజీ సర్పంచ్ ఘంటసాల సీతాంజనేయులు, ఉప సర్పంచ్ ఊడిమూడి పెద్దిరాజు పాల్గొన్నారు.

తొలగనున్న ముంపు కష్టాలు

- రూ.60 లక్షలతో ఏనుగులకోడు డ్రెయిన్ పూడికతీత
- ఖరీఫ్‌కు ముందే మొదలైన పనులు
- అన్నదాతల్లో ఆనందోత్సాహాలు

తోట్లవల్లూరు: ఏనుగులకోడు డ్రెయిన్ పూడికతీత పనులతో పంటపొలాలకు ముంపు కష్టాలు తొలగనున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్‌కు ముందే ప్రభుత్వం పూడికతీత పనులు జరుపుతుండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే.. తోట్లవల్లూరు మండలంలో ప్రవహించే డ్రెయిన్లలో ఏనుగులకోడు ప్రధానమైనది. ఇది బందరు కాలువను ఆనుకుని ప్రవహిస్తుంటుంది. వేలాది ఎకరాలకు రక్షణ కవచంలా ఉపయోగపడుతుంది. వర్షాకాలంలో ఈ డ్రెయిన్ ద్వారా అందే నీరే కీలకం. పొలాలు వర్షాల బారిన పడినప్పుడు, పొలాల్లోని ముంపు నీరంతా గంటల వ్యవధిలో ఈ డ్రెయిన్ ద్వారానే బయటకు వెళ్లాల్సి ఉంటుంది.

ఎమ్మెల్యే కైలే చొరవతో..

ఏనుగులకోడు డ్రెయిన్ పరిధిలో వరి సాగు చేసే రైతులకు ఏటా కన్నీళ్లే దిక్కవుతున్నాయి. డ్రెయిన్ తరచూ పూడుకుపోవటం, గట్లు పటిష్టంగా లేకపోవటంతో ప్రతి ఏటా వర్షాకాలంలో డ్రెయిన్ పరిధిలోని పంటపొలాలు నీటి ముంపుకు గురై, రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. దీనిపై పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఈ ఏడాది ప్రత్యేకంగా దృష్టి సారించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వర్షాకాలంలో పంటలు ముంపు బారినపడకుండా ఉండేందుకుగానూ ఈ ఏడాది ముందస్తుగానే డ్రెయిన్ పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు.

చురుగ్గా పూడికతీత పనులు..

మండలంలోని రొయ్యూరు నుంచి పమిడిముక్కల మండలం ఫత్తేలంక వరకు 14.50 కిలోమీటర్ల పొడవున సుమారు రూ.60 లక్షల వ్యయంతో ఏనుగులకోడు పూడికతీత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పూడికతీతతో డ్రెయిన్ పొడవునా ఉన్న వేలాది ఎకరాల పంట పొలాలకు వర్షాకాలంలో ముంపు సమస్య తీరనుంది. పొలాల్లోని మిగులు నీరంతా డ్రెయిన్ ద్వారా త్వరితగతిన బయటకు వెళ్లిపోతుందని రైతులు అంటున్నారు. దాంతో పొలాలు ముంపు బారినపడే అవకాశం ఉండదని చెబుతున్నారు. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తయ్యాయని, సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి చేయనున్నట్లు డ్రెయినేజీ ఏఈఈ ఉదయకిరణ్ తెలిపారు.



వల్లూరుపాలెం వద్ద ఏనుగులకోడు డ్రెయిన్‌లో పూర్తయిన పూడికతీత పనులు

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కైకలూరు: స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సోమవారం ఉదయం 7 గంటలకు కైకలూరు వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్ లబ్ధిదారులతో సమావేశమవుతారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కలిదిండి మండలం పెదలంక గ్రామ సచివాలయ పరిధి పల్లిపాలెంలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

సుబ్బారాయుడికి విరాళం



ముదినేపల్లిరూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి దాత ఆదివారం వెండిని విరాళంగా అందజేశారు. కృష్ణాజిల్లా పెడన మండలం చెన్నూరుకు చెందిన యర్రంశెట్టి సుబ్రహ్మణ్యం కుమార్తె త్రిలోచన అంతరాలయ ముఖ ద్వారానికి వెండి తాపడం నిమిత్తం 503 గ్రాముల వెండిని స్వామి సన్నిధిలో ఆలయ సిబ్బందికి అందించారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ సిబ్బంది అభినందించారు.

విద్యతో సామాజిక అసమానతలు దూరం



గుడివాడటౌన్: ప్రతి వ్యక్తి విద్యావంతుడైతే సమాజాన్ని అర్థం చేసుకుంటాడని తద్వారా సామాజిక అసమానతలు దూరమవుతాయని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక దనియాల పేటలోని ప్రణవాశ్రమంలోని త్రివిక్రమ బాల ఛాత్రాలయం 16వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులు సమాజం అభివృద్ధిపై దృష్టిపెడతారన్నారు. సంఘసేవ అవసరతను గుర్తిస్తారని తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ గుడివాడ సౌజన్యంతో రూ.15 వేలు విలువ గల ఎల్‌సీడీ టీవీని ఛాత్రాలయ విద్యార్థులకు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ స్థైర్యానంద సరస్వతి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, పర్వతనేని చంద్రశేఖర్, డీఆర్‌బీ ప్రసాద్, ఆర్.వేణుబాబు, లయన్స్‌క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షుడు కేవీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయి

శాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి



ప్రమాణ స్వీకారోత్సవంలో బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి, ఎమ్మెల్యే నాని, కాళీ తదితరులు

గుడివాడరూరల్: రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరలా అధికారంలోకి తీసుకువస్తాయని శాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని లింగవరం గ్రామంలోని కె.కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాశేశ్వరరావు(కాళీ) ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి విశేష మద్దతు ఉందన్నారు. ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్ మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయం సాధించడం తథ్యమన్నారు. ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి హరికృష్ణ ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చానని, ఎన్టీఆర్ తన దైవమని, నందమూరి కుటుంబానికి ఎప్పటికీ విధేయుడన్నారు. చంద్రబాబు, లోకేష్ దమ్ముంటే గుడివాడ, గన్నవరం నుంచి పోటీ చేసి తనను, వల్లభనేని వంశీలను ఓడించి వారి దమ్మును నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

పార్టీ తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యం

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీసీలు మరోమారు జగనన్నను సీఎంగా చేసి కృతజ్ఞతలు చాటుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడిగా ఎన్నికైన మెరుగుమాల కాళీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానిలు తనపై నమ్మకం ఉంచి ఇచ్చిన పార్టీ పదవికి న్యాయం చేస్తానన్నారు. వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, పేర్ని కిట్టు, సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రామ్‌ప్రసాద్, ఎంవీ నారాయణరెడ్డి, పాలేటి చంటి, ఉప్పాల రాము, పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మట్టా జాన్‌విక్టర్, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, గుడివాడ ఎంపీపీ గద్దే పుష్పరాణి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. తొలుత రామనపూడి నుంచి కాళీ యూత్ సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు.

సమస్యలపై తక్షణం స్పందించాలి

ఎమ్మెల్యే డీఎన్నార్



పెదపుట్లపూడిలో వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డీఎన్నార్ తదితరులు

కైకలూరు(కలిదిండి): గ్రామాల్లో ప్రజలు చెబుతున్న సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదేశించారు. కలిదిండి మండలం పెదలంక గ్రామ సచివాలయ పరిధి పెదపుట్లపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముందుగా గ్రామంలో పెద్దింట్లమ్మను ఎమ్మెల్యే దర్శించుకుని విశేష పూజలు చేశారు. అనంతరం మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన కుటుంబాలకు సంక్షేమ వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు పింఛను రాలేదని చెప్పారు. వెంటనే సంబంధిత వలంటీర్‌ను మరోసారి పేరును పరిశీలించాలని సూచించారు. అదే విధంగా విద్యుత్ స్తంభాలు కొన్ని ప్రాంతాల్లో అవసరమవుతాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎమ్మెల్యే డీఎన్నార్ ఆ శాఖ అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీరావు, ఏలూరు జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, వైస్ ఎంపీపీలు కనకదుర్గారాణి, నాగలక్ష్మి, సర్పంచ్ మోకా లక్ష్మి, ఎంపీటీసీ రావడి బాలబాలాజీ, ఏఎంసీ వైస్ చైర్మన్ రవికుమార్, నాయకులు మోకా రామకృష్ణ, నున్న భగవాన్, ముద్దం గాంధీ, ఊర శ్రీధర్, చిట్టూరి బుజ్జి, ద్రోణాద్రి ఫ్రాన్సిస్, పోత్రు నాగన్న, వాసురాజు, బొమ్మిడి ధనరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



ఎమ్మెల్యే కైలేను సన్మానిస్తున్న సచివాలయ కన్వీనర్లు

పామర్రు: రానున్న కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి కృషి చేస్తామని ఐదు మండలాల సచివాలయ కన్వీనర్లు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థ ద్వారా ప్రతీ ఇంటికి వెళ్లి పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ పార్టీ ప్రతిష్టకు చర్యలు చేపడతామన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం

ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమాన్ని ఇంటింటికి విస్తరించేలా చర్యలు తీసుకుంటామని సచివాలయ కన్వీనర్లు తెలిపారు. అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ చేపట్టిన నవరత్న పథకాల గురించి వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేపడతామన్నారు. వచ్చే ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే అనిల్‌కుమార్ భారీ మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేసి మరలా రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి అయ్యే విధంగా పని చేస్తామన్నారు. అనంతరం పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను సచివాలయ మండల కన్వీనర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు ముప్పిడి సురేష్‌రెడ్డి, నడకుదురి రాజేంద్ర, పరసా జగన్‌మోహన్‌రావు, సమ్మెట ఆంజనేయులు, జాజుల చిన్నారి పాల్గొన్నారు.

పరామర్శ..

పెదపారుపూడి మండలంలోని వింజరంపాడులో పార్టీ సీనియర్ నాయకుడు కొడవళ్ల మురళీ తల్లి రాజేశ్వరమ్మ సంస్మరణ సభలో ఎమ్మెల్యే కైలే, ఎంపీపీ గోగం సురేష్ పాల్గొన్నారు. కొడవళ్ల మురళీ, వెంకటేశ్వరరావులను పరామర్శించారు.

ఘనంగా మొహిబుల్లాషా చిష్టి ఉరుసు



పామర్రు: స్థానిక హజరత్ జయావుల్ హక్ లీమా అల్లా మొహిబుల్లాషా చిష్టి వారి 79వ ఉరుసును శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత ఉరుసును పురస్కరించుకుని పూజా సామగ్రిని, గంధం తదితరాలను గ్రామంలోని వీధుల వెంబడి మేళ తాళాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపు జరిపారు. దర్గాను నూతన వస్త్రాలు, పలు రకాల పూలతో విశేషంగా అలంకరించారు. ఆలీ ఆసిఫ్ ఖాన్, ఆలీ ఆఫ్తాబ్ ఖాన్‌ల ఆధ్వర్యంలో ఉరుసు నిర్వహించారు. అనంతరం దర్గా వద్ద ప్రసాదాన్ని పంపిణీ చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. కవాలీ ప్రోగ్రామ్ భక్తులను రంజింపజేసింది.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచి గుడివాడ వారు ఇచ్చిన ఆదేశం ప్రకారం యావన్మందికీ తెలుపునది ఏమనగా... ఈ క్రింది షెడ్యూలులో చూపిన సతరబోయిన అంజనేయులు గారి కుమారుడు సతరబోయిన శ్రీను గారి స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేసుకుని సతరబోయిన శ్రీను గారి భార్య సతరబోయిన వెంకట నాగలక్ష్మి గార్కి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నాము. కావున సదరు వ్యవహారానికి సంబంధించి ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరాలు గానీ, ఆప్పులు, ఛార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదాలు ఉన్న యెడల నేటి నుండి 7 రోజులలోపు ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరాలకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూల్ : పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు మండలం, ఏలూరు సబ్ రిజిస్ట్రారులో చేరిన సత్రంపాడు గ్రామ ఆర్.ఎస్. సర్వే నెం. 21, 54లు లోని చ.గ. 107.30లు కు దస్తావేజు నెం. 4085/2022గా గల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు **తూర్పు :** ప్లాటు నెం. 28, ఆస్తి, **దక్షిణం :** జె. వెంకట సత్యనారాయణ గారి ఆస్తి, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** ఇతరుల భూమి.

పంద్రాజు రాంబాబు, న్యాయవాది, మెయిన్‌రోడ్, ఉయ్యూరు

నాంచారమ్మ సేవలో డీసీ విజయరాజు

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారిని దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ విజయరాజు ఆదివారం దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ అధికారులు, పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి ప్రధాన జాతర ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈఓ సీతారామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.